

# రత్నగుండం

**చెంచాయి** తండ్రి చెంచులే, తల్లి చెంచమ్మే. ఇపుడు చెంచాయికి పెండ్లై మరల ఓ చెంచమ్మే అతనికి భార్యగా ఆ గడప తొక్కింది. చెంచు కొలువు కొలిచే ఆ కులంలో ఎక్కువగా చెంచులే కనిపిస్తారు.

ఎన్ని కొలువులు కొలిచినా చెంచమ్మ కడుపున పంట పండే సూచన కనిపింపలేదు వారికి.

నాగుల చవితినాడు పట్నం నుంచి పండగ సామానుతో ఇంటికొస్తున్న చెంచాయిని నాలుగ్గంటలు నిలేసింది దారిలో నాగుబాము. పక్కకు తప్పుకో జూశాడు. పడగవిప్పి ఆడుతూ ఎటుబోతే అటు వచ్చి బుసలు గొట్టింది. పాముల పాపయ్యను కేక వేయాలనుకున్నాడు. రెండు మైళ్ళున్న గూడెంలోని మనిషిని

కేకవేయడం వృథా శ్రమే అయింది. ఇన్ని జరిగినా అది అదరక బెదరక అడుగైనా ముందు కేయనీయ లేదు చెంచాయిని. దానిపైపు ఉరిమి చూశాడు. అది బుసలు కొడుతూ మిలమిల మెరిసే కన్నులతో ఓ జానెడు పైకి లేచి నిలబడింది. అంతవరకు నాగును చంపని చెంచాయి వెనుదిరిగి పోవాలనుకున్నాడు. పులి వాగు వద్ద పులిమాటు వేసేవేళ ఒంటరిగా ఉన్న చెంచాయి ఎలాగయినా గూడెమే చేరాలనుకున్నాడు. తనను ముందు కేగనీని పామును పడగొట్టాలనే నిశ్చయించుకున్నాడు ఆఖరుకు. పొడుగాటి చెట్టుకొమ్మ విరిచి పడగ విప్పి ఆడుతున్న పాము పడగపైకి బలంగా విసిరాడు. పడగను నేలకేసి బాదుకుంటూ మెలికలు తిరిగి చచ్చిపోయింది అది. అనుమానం వేసి అటు ఇటు కదిల్చి చచ్చిన దానిపై పిడుగులేసి చితిలా పేర్చి పట్నంనుంచి తెస్తున్న కొత్త గుడ్డ చించి కాసులేసి కాల్చివేశాడు.

ఆరాత్రి గోవుగాటి గుంజనున్న పలుపుజ్ఞాచి పామని అదిరి పడ్డాడు చెంచాయి!

అదేరాత్రి అతని వెచ్చని కౌగిట్లో చల్లని కబురూదింది చెంచమ్మ. "ఆ!" అని ఆశ్చర్యపోయాడు చెంచాయి. ఇన్ని సంవత్సరాల తర్వాత తన చెంచి ఓ తల్లిగాబోతూంది. ఎంతో సంబరపడిపోయాడు. అంతలో అతనికి ఆనాటి సంఘటన జ్ఞప్తికి వచ్చింది. 'అయ్యో! చెంచు దేవతా! ఈ రోజే నాచేత ఈ పని ఎందుకు చేయించావు, తల్లీ' అనుకున్నాడు మనసులో.

చెంచమ్మను నీళ్ళాడించిన నీలి ఓ వింత విషయమే బయటపెట్టింది—"పుట్టిన బిడ్డకు రెండు తొడలపై రెండు నాగుల్లాటి మచ్చలున్నాయి" అని. ఈ విషయం విన్న చెంచాయికి శరీరమంతా చెమటబట్టింది. మంత్రసాని మాటవిని 'నాగులు' అని పేరెట్టమన్నారు అమ్మాయికి. 'నాగులు' అన్న పేరువినటానికే భయం వేసింది చెంచాయికి. "ఇక రెండోమారా పేరెత్తితే ఊరుస్తా"నన్నాడక్కడ ఉన్న వారిని. అంతు తెలియని అతని ఆంతర్యం అంతర్యంగానే ఉండిపోయింది.

ముత్యాల్లా ఉన్న తన కూతురికి 'రత్నాలు' అని పేరెట్టుకున్నాడు చెంచాయి. మచ్చలు మాపు చేయాలని చేయవలసిన చిట్కాలన్నీ చేశాడు. ఆకులలములు రుద్ది పసురు పచ్చలు రాయించాడు. అవి పోలేదుగాని పెరుగుతున్న రత్నాలుతో పాటు అవీ పెరగసాగాయి. వాటిని చూస్తున్నచెంచాయి మనసులో భయం బడబాగ్నిలా రేగింది. వాటి అంతు ఏమిటో కనుక్కోవాలని చేయి చాపి శాస్త్రం చెప్పమన్నాడు. "నాగుల చవితినాడు నాగునేసేవు. నాగులసురు నాతికేసింది" అన్నాడు జ్యోతిష్యుడు. "అంటే" అన్నాడు చెంచాయి. విడమరిచి చెప్పి తన కూతురు తొడలపై మచ్చలున్న విషయం తెలిపి, "తొలి మనువు తొలగిపోతే మలి మనువు మన్నునా" అన్నాడు శాస్త్రజ్ఞుడు.

ఉన్నవారికే అన్నీ లేనివారికి ఏమీలేదు లేనివారిమాట అటుంచితే మనసున్నవారికి తనువులు మెసే భావన కలుగదు. కలగడానికి అవకాశం ఏర్పడితే మాత్రం ఏదీ నిలవదు

కాలంతో పాటు పెరిగి పెద్దై రత్నాలు రత్తి అయింది. మిస మిసలాడే రత్తిని చూచి గుటకలు మింగాడు చెంచమ్మ తమ్ముడు కనకం. చిన్నతనం నుంచి పెంచి పెద్ద జేసిన కనకమంటే చెంచమ్మకు, చెంచాయికి పంచప్రాణాలు. అందుకే ఎప్పటికైనా రత్తి కనకానిదే అనేది చెంచమ్మ. కోరమీసాలు చూచి తుప్పుక్కున ఉమ్మేసి అడివితేనలకై వెళ్ళేరత్తిని చూచి మీసాలు మెలేసేవాడు కనకం. "ఇంకా వారినో జంటజేయక ఒంటి పక్కల్లో తిరగనివ్వడమెందుకు" అనేది చెంచమ్మ. చెంచయ్యకిది భరింపరాని మనో వేదనే అయింది. "చేజేతులా కనకాని...." ఇక నిలువలేక పోయాడు.

ఆ రాత్రి పనిగట్టి రత్తిని బయటికి పంపి రహస్యంగా భార్య చెవిలో ఊదాడు శాస్త్ర ఫలాన్ని. ఇది తెలిసి కన్న ఊరెళ్ళుతానన్నాడు కనకం. "ఉపాయముంటే అపాయమే ఉండదు. అందుకే ఉపాయమాలోచించాలి. కాని ఇలా పిరికిమందు తింటారట్రా" అని మందలించి పిరికిమందు తినుంటే అది కక్కేయమంది చెంచమ్మ కనకాన్ని. "ఇలా పిరికిగాబట్టే గూడెంలో గంగులు నెదిరించి ఘనత చాటుకోలేకపోయావు" అని చివాట్లేసింది. ముగ్గురూ కలిసి మంతనాలాడారు ఆరాత్రి. వారి ఆలోచనకు గంగులే గురయ్యాడు. గూడెంలో గంగులున్నంత వరకూ కనకానికి శునకం గతే. ఈ పాచిక పారితే ఒక్క వేటుతో రెండు పిట్టలన్నట్టు అటు గంగులుతో మనువు, మనువు తర్వాత మనువు కనకం. ఆపై కనకానికి గూడెంలో కనకాభిషేకమే. గంగులు తర్వాత కనకాన్నెదిరించగల గుండెలు గూడెంలోనే లేవు.

ముగ్గురి మంతనాలు మాటు మణిగేసరికి తెలతెలవారింది.

గూడెమంతా కలిసి గుట్టమీదున్న మారమ్మ తిరనాళ్ళకు వెళ్ళారు. మల్లయుద్ధంలో అందర్ని ఓడించాడు గంగులు. కర్రబట్టి గరిడీ తిప్పి సెభాసనిపించుకుని గూడెనికంతా ఎదురులేని వీరుడని చాటుకున్నాడు మరోమారు. కండలు తిరిగిన గంగులు శరీరం చూచిన రత్తికి ఒళ్ళంతా పులకలేసింది. కన్నెపిల్లల మనసులు కదం తొక్కాయి.

మరునాడు చెంచాయితో కలిసి ఇంటికి వచ్చిన గంగులును చూచి కన్నుల పండగే చేసుకుంది రత్తి.

కుల గురువు నాహ్వానించి గూడెంలోని పెద్దలను పిలిచి మనువు సంగతి మాటల్లోకి దింపాడు చెంచాయి. రత్తిని, గంగులును పిలిచి వారినడిగి సై అంటే సై అనిపించుకున్నారు. అయితే గడువు లోపల గండు పులినేసి తెమ్మన్నారు కులాచారం ప్రకారం.

డప్పులు కొడుతూ బయలు దేరారు జనం. సాలుపట్టి సరసరా బాణంలా దూసుకుపోతున్నాడు గంగులు. అయినా అతని సాల్లోకి రాలేదు ఆ పులి. సాలు తప్పిపోతున్న దాన్ని చూచి, 'గంగులుకు గడువుపులే ఎదురయిందీ రోజు' అనుకున్నాడు గంగులు మనసులో. అందుబాటు మించి అందకపోతున్న దెబ్బలిని గురి చూచి గుండెలో వేశాడు. గుండె తప్పి గూటికి గుర్తు చేసింది బాణం. దెబ్బతిని పారిపోయిన పులిని చూసి పారు కున్నారు అందరూ. గంగులు తన విశ్వాసమైన వేట కుక్కతో మిగిలాడు ఒంటిగా. కొంతదూరం నెత్తుటి మరకల్ని బట్టి మార్గం తీశాడు. ఆపై అడవిలో అలిపిగాలేదు మార్గం. వాసనబట్టి దారి తీసింది అతని వేటకుక్క. తన జీవితంలో ఏనాడూ అది గంగులును ఒంటరిచేసి వదిలిరాలేదు అడివిలో. ఏ ఆపదా రానీక కాపాడుకొస్తూంది తన యజమానిని. వయసైపోతున్న దాన్ని చూచి 'అయ్యో, పాపం! వయసైపోవచ్చింది. అందుకే పగిరింపు ఎక్కువైంది దీనికి. ఇంటివద్ద విడిచి వచ్చినా బావుండేది' అనుకున్నాడు గంగులు మనసులో.

ఉన్నట్టుండి గమనాన్ని తగ్గించి గాలి పట్టసాగింది కుక్క. అనుమానమై అన్ని దిక్కులకు చూశాడు. పులిజాడే కనిపించలేదతనికి. ముందుకేగమని మాగసైగ జేశాడు. ఒక్కొ అడుగే ముందు కేస్తున్న దాని నరనాడులు అదరసాగాయి. అనుమానం వేసిన అతనికి అందుబాటులో వేళ్ళతో మొదలంటు కూలిన చెట్టు వేళ్ళు వ్యాపించిన దెయ్యం జుట్టులా కనిపించాయి. వేళ్ళమాటున నక్కి కొద్దిగా పైకి లేస్తున్న పులితోక కనిపించింది అతనికి. అనువుకై అటు ఇటు చూశాడు గంగులు. అంతలో అంతులేని బలాన్ని పుంజుకుని అమాంతంగా ఒక్క దూకు దూకింది కుక్కపైకి పెద్దపులి. అంతే భయంతో వణుకుతున్న అది ఉన్నచోటునే కుప్పగా కూలిపోయింది. బాకుతో బాణంలా దూసుకుపడ్డాడు పులిమీద గంగులు. పోటు మీద పోటు పొడిచాడు. ఎంతచేసినా అతనికి ఫలితం లేకపోయింది. ఎప్పుడో అనంతవాయువుల్లో లీనమయిపోయాయి అతని బంటు ప్రాణాలు.

ఆత్మ బంధువును పోగొట్టుకున్నట్టు విలపించాడు గంగులు. చచ్చిన పులి గోళ్ళయినా

(తరువాయి 54 వ పేజీలో)

సి. రామచంద్రరాజు

కోసుకోక ఆత్మ శోధనతో గూడెం చేరుకున్నాడు కుక్కశవంతో. మానవుని లాగ మట్టి గలిపాడు దానిని.

పులి పంజా దెబ్బతో చీరుకుపోయిన ఉక్కులాంటి గంగులు శరీరానికి కాపడాలు కాచి పసుర్లు పూసి పట్టులేసి కట్టు గట్టింది రత్తి. అన్నీ వదిలి అర క్షణమైనా ఉండలేక పోయింది. ఒళ్లు మరిచి ఒళ్లో నిద్రిస్తున్న గంగులు ముంగురులు సవరించి ముద్దు పెట్టుకుంది. రత్తి సేవలతో త్వరగా నయమైంది గంగులుకు.

కార్యం స్థిరంచేసి కాళీదేవతను కళకళలాడించారు. కాళిముందు కంకణాలు గట్టి గంగులును, రత్తిని బాస పలికించి భార్యాభర్తలుగా చేశాడు కులగురువు. కార్యంలో కార్యమని కర్తను చేసి గూడేనికి పెద్దను చేశారు గంగులును.

కనకానికి కన్ను కుట్టినట్టయింది. అయినా ఇది త్వరలో తనకు జరగబోయే తంతుగా

# రత్తిగుండం

(15 వ పేజీ తరువాయి)

తలచుకొని ఊరటిల్లాడు.

కాళి దగ్గర చేయి కలిపి చెట్టాపట్టా లాడితే వారిని చూసి సిగ్గు పడింది రత్తి. పులివేషం వేసి డప్పుల ముందు డాబుసరిగా పులడుగు వేస్తే కాలు కదిపి భుజాలెగుర వేయసాగాడు గంగులు. అది చూసి తనలో తను నవ్వుకో సాగింది రత్తి. తంతంతా పూర్తయిన వెనుక గంగులును, రత్తిని కలిపి కొంగులు ముడేసి కాడిగా గట్టారు. అలానే గూడేనికి తరలివచ్చి అడవిలో విహరించి రమ్మని ఉడాయి కంపారు కొత్త జంటను.

జంట తేనెలు తీసి జుర్రుకున్నారు జంటగా. పాలపండ్లు, వగడపండ్లు ఏరి కంద మూలాలు తవ్వి కాల్చుకు తిన్నారు. జారుడు బండదాటి మోకాటెక్కుడెక్కి వల్లకోన దిగి మోర కింద మొగిలి పొదలు చేరారు ఇద్దరూ. మొగిలి చెట్టెక్కి మొగిలి పూలు కోశాడు గంగులు. మొగిలి మొగ్గలు సిగలో తురుము కుంటూ, "మొగిలి పొదలో మిన్నాగు లుంటాయి. మరి మిన్నాగులంటే భయంలేదూ, గంగూ, నీకు" అంది రత్తి. "నాగులంటే నాకేటి భయం నా చేతుల్లో ఈ రేఖలుండగా" అంటూ రెండు చేతులను గరుడరేఖల్ని చూపాడు గంగులు. మన్నెపు టడవిలో మాటు మూలలన్నీ తిరిగారు ఇద్దరూ. ఐదు రోజులు ఆనందంగా గడిపి గూడెం చేరాలన్నాడు గంగులు. మారమ్మను మనసారా పూజించి పోదామంది రత్తి.

మారమ్మకై మారేడు పత్రాలు కలిపి మాల అల్లింది రత్తి. మారమ్మ దగ్గర మాకులే అయి ఉన్నాయి మల్లె పొదలు. పందిరెక్కి దోసిలి నిండుగా మల్లెపూలు కోసింది రత్తి. దిగడం చిక్కయి లంఘించబోయింది. అందుకొని అక్కున చేర్చుకో పోయాడు గంగులు. "మారమ్మ దగ్గర మతితప్పితే గతి తప్పి మసులుతారోయేమో. మనసులు మల్లెలా ఉంచుకో" అని మందలించింది రత్తి. మారమ్మను మనసారా పూజించి దగ్గర దారిపట్టి గూడెం చేరుకున్నారు ఇద్దరూ. ఐదు రోజుల తర్వాత గూడెంలో కాలు పెట్టిన కొత్త దంపతుల్ని వాహ్వానించి ఆదరించింది గూడెం.

ఆరు మాసాలు లక్కె గడిచాయి. భద్ర వసం దాటినా బ్రతంగానే ఉన్నాడు గంగులు. తనకు అన్యాయమే జరిగిందని మొత్తుకొని శాస్త్రాన్ని నమ్మి శత్రువుకు పిల్లనిచ్చాడని దెబ్బ పొడిచాడు కనకం చెంచాయిని. ఇది భరించరాని బాధే అయింది చెంచాయికి.

ఇద్దరూ కలిసి మాటేసి గంగులును మట్టు పెట్టమని ఎందరినో పనిచారు. కాని అందుకు ఎవ్వరూ ఒప్పుకోలేదు. ఆశ చూపితే అందులో ఒకడు సై అన్నాడు.

నాగులేటి గట్టున అడవికేగి ఆద మరిచి నిద్రిస్తున్న గంగులును గుండెత్తి గూబ మీద వేయాలను కున్నాడు వాడు. గుండు క్రింద చేయేసినవాణ్ణి యముడు కాలనాగై కాటేశాడు. నురగలు గక్కుతూ తుస్సు మన్నాడు వాడు. విషయం విన్న చెంచాయికి ఒళ్లంతా తేళ్లు జెర్రులు ప్రాకినట్టయింది.

కాలంగాని కాలంలో నాగులేటికి వరద ముంచుకొచ్చింది. రాళ్లగుండం రాళ్లను రప్పల్ని వెలివేసి కటిక బండల్ని బయటవేసింది. అడవికేగిన గంగులును, రత్తిని రెండు రోజులు దాటనీయలేదు రాళ్లగుండం. రాళ్ల గుండంపై మారమ్మగుడిలో తలదాచు కున్నారు ఇద్దరూ.

ఎన్నడూ జరగని వింతలే జరిగాయి ఆ వరదల్లో. గూడెన్ని ముంచెత్తి కాళమ్మ దేవత కాళ్లు గడిగింది నాగులేరు. పొన్న చెట్టును పార్శించుకు పోయింది తనలో.

అలంకరణ

చిత్రం— ఎస్. వి. రామంచయ్య, ఒంగోలు-13)



గూడెమంతా కలిసి గట్టు మీదికి వెళ్లి మారెమ్మ గుడిలో దాచుకున్నారు. ముత్తైదువలు పెరుగు పళ్ళెలను తీసికొని నీళ్ళమ్మను శాంతి చేయటానికి నాగులేటిగట్టుకు గుట్ట మీదుగా వెళ్ళారు. గట్టు ఉల్లి గంగలో కలిశారు అందరూ.

గడ్డకోసి గట్లు పెంచి గుట్టల్ని గుంటలుగా చేసి గుంటల్ని గుట్టలు జేసి శాంతించింది నాగులేరు.

వెదురు దిబ్బమీద పడున్న చెంచమ్మ శవాన్ని ఓ నాగు చుట్టే ఉంచింది. ఇది విన్న చెంచాయి ఇల్లు వదిలి రాలేక పోయాడు. గూడెం చేరిన గంగులుకు రత్తికి విషయం తెలిసింది. తల్లిపోయిందని తల్లడిల్లింది రత్తి. వెదురు దిబ్బకు దారి తీశారు అందరూ. వీరిని జూచి శవం వదిలి వెదురు పొదల్లోకి వెళ్ళింది నాగు. చెంచమ్మ శవానికి అంత్య క్రియలు జరిపి ఇల్లు జేరుకున్నారు అందరూ.

చెంచాయి ఉండి ఉండి ఉలిక్కిపడజొచ్చాడు. నాగులు! నాగులు!! నాగులు!!! తన జీవితాన్నంతా వెంటాడుతున్నాయి నాగులు. అతని కళ్లకు నాగులే కనిపింప సాగాయి. మిలమిల మెరిసే కన్నులతో బుసలు కొడుతూ నాగులు తన మీదకు వస్తున్నట్లయి కంటి మీద రెప్పవేయలేకపోయాడు. చెంచమ్మ సమాధి దరిదాపులకైనా పోలేకపోయాడు. నాగులేటిని తలచుకొని నిలువలేకపోయాడు. అచట అన్ని ప్రదేశాల నుంచి నాగులు నాట్యం చేస్తూ తన మీదకు వస్తున్నట్లనిపించింది చెంచాయికి. వాటినుంచి ఎలాగయినా తప్పించుకు పోవాలను కున్నాడు. ఊరు వదిలివెళ్లి గాలి మార్పుచేసి గతం మరవాలనుకున్నాడు. కనకాన్ని పిలిచి గూడెం వదిలి వెళ్లిపోదామన్నాడు. రత్తిని వదిలి ఎలా రానన్నాడు కనకం. రత్తిని, గంగులును పిలిచి అదే చెప్పాడు చెంచాయి. కారణమడిగితే కాఠిన్యమే చూపాడు. "పుట్టిన ఊరు వదిలి పురుగైనా పోదు. పుట్టినచోట గిట్టితే పుణ్య" మంది రత్తి. కనకంతో కలిసిఊరు వదిలి వెళ్లి పోయాడనిపించాడు చెంచాయి.

అర్ధరాత్రి ఆవు అరిచింది. గంగులు గుండెల్లో నిద్రిస్తున్న రత్తికి మెలకువ వచ్చింది. గంగులును లేపి దీపంవత్తి పెద్దది చేసి చూసి రమ్మంది. చూసి ఏమీలేదని వచ్చి కూర్చున్నాడు ప్రక్కన. ఇక నిద్ర పట్టక మాటల్లోకి దిగారు ఇద్దరూ. మాటల మధ్య మాసాలు లెక్కెట్టి సిగ్గుపడి గంగులు గుండెల్లో తలదాచుకొంది రత్తి. గంగులుకు పరమ ఆనందమే అయింది. రత్తిని గుండెలకు గట్టిగా అదుము కుంటూ, "రత్తి, నా రత్తి! అయితే వాలాటివాణ్ణే నాకియ్యవే, నా రత్తి" అన్నాడు



తల్లి బిడ్డ

[illegible] చిత్రం — [illegible] ([illegible]పేట)

గంగులు. మరునాడు ఉదయం మారెమ్మను మనసారా కొలిచి రావాలనుకున్నారు ఇద్దరూ.

ఆకు వక్కలతో పసుపు కుంకుమతో టెంకాయ కర్పూరములతో మారెమ్మ వద్దకు బయలు దేరారు ఇద్దరూ. కొండవాలు నుంచి కోన ఎక్కారు. అగాధంలో ఉన్న రాళ్ల గుండాన్ని చూచి ఎప్పుడూ కళ్లు తెరవని రత్తికి కడుపులో కలిచినట్లయి కళ్ళు తిరిగాయి. గంగులుతో కలిసి మారెమ్మ గుడి చేరింది రత్తి. మారెమ్మ గుడిలో అక్షింతలు పెట్టి గంగులును పూలు కోసుకురమ్మని పురమాయించింది రత్తి. మల్లెలకై గుడ్డి పక్క మలుపు తిరిగి "అమ్మో!" అని కేక వేశాడు గంగులు. అతని నల్లని గుండెల్లోంచి వరద గోదావరి వెల్లువలా ఎర్రటి రక్తం ఉప్పొంగుతూ బయటకు ఉరకలేసింది. వాలి పోతున్న గంగులును బట్టి గిరవాటేశారు రాళ్ల గుండంలో కనకం అనుచరులు. రాళ్ల గుండంలో పడ్డ గంగులు శరీరం ఎర్రని ముద్ద బంతి పూవులా ముడుచుకుపోయింది.

గుడినుంచి కేకతో బయటికొచ్చిన రత్తి చేతిని గట్టిగా పట్టుకున్నాడు కనకం. "గంగూ, గంగూ" అంటూ కేకలే వేసింది రత్తి. అయినా అతడు ఆ చేతిని వదల్లేదు. అతనితో పెనుగులాడుతూనే గుడిలోని మారెమ్మ చేతనున్న కత్తినే అందుకుంది. భయపడి చేయి వదిలి దూరంగా పోయాడు కనకం. ఆ చేయి నాకేల? కత్తితో నరుక్కొంది చేతిని. "గంగూ, గంగూ! నన్నొదిలి నీవెక్కడికి పోతావు? నన్నొదిలి నీవు పోవు. నిన్నొదిలి నేనుండలేను" అంటూ "గంగూ, గంగూ" అని రాళ్లగుండంలోకి దూకింది రత్తి.

అప్పుడే గుడి మలుపులోంచి అచటికి వచ్చి ఈ దృశ్యం చూసిన నిశ్చేష్టుడయినిలిచి పోయిన చెంచాయికి రాళ్ల గుండంలో రెండు ముద్దబంతి పూలు కనిపించాయి. 'గంగూ, గంగూ' అన్న రోదనం ప్రతిధ్వని వినే స్థితిలో లేడు చెంచాయి.

స్వచ్ఛమయిన నీటిని ప్రవహించే రాళ్ల గుండం రక్తాన్ని ప్రవహింపజేసి రక్తగుండమే అయింది. రత్నాలు రత్తి అయింది. రత్తి రత్తమ్మ కాకనే రత్తమ్మతల్లి అయి పూజలందు కుంటూంది.

రాళ్లగుండం రక్తగుండమై కాలంలో కలిసి రత్తిగుండమే అయింది.

అదే రత్తిగుండం. ★